# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తిరుపతి-పాకాల-కాట్పాడిల మధ్య 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
2. **వర్షాకాలం రానున్న దృష్ట్యా ముందుస్తుగా ఇసుకను నిల్వ చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **తెలంగాణలో కుల గణనను విజయవంతంగా నిర్వహించామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్ లో డ్రోన్స్ ద్వారా గంజాయి సాగు, రవాణా నివారణకు చర్యలు తీసుకుంటున్నామని హోంశాఖ మంత్రి వి అనిత పేర్కొన్నారు.**
5. **జైనమత తీర్థంకరులు వర్ధమాన మహావీర్ జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మధ్య బంగాళాఖాతం మీదుగా కదులుతూ క్రమంగా బలహీనపడేఅవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటిలేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు బలమైన ఈదురు గాలులు గంటకు 40 -50 కిలో మీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది.

మరోవైపు క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలో ఈరోజు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

--------------------------

తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న జరిగిన మంత్రి వర్గ సమావేశ నిర్ణయాలను ఆయన పాత్రికేయులకు వివరించారు. 1,332 కోట్ల రూపాయలతో డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులతో 400 గ్రామాల్లోని 14 లక్షల మంది జనాభాకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంత్రి వివరిస్తూ...

వాయిస్...29 సెకన్లు

అలాగే సాగునీటి సరఫరా వ్యవస్థ ఆధునీకరణకు కింద కమాండ్ ఏరియా ఆధునీకరణ, అభివృద్ధి, నీటి నిర్వహణ –సీఏడీడబ్ల్యూఎం పథకానికి ఆమోదం తెలిపిందని చెప్పారు.

-----------------------------

వర్షాకాలంలో నిర్మాణ రంగానికి ఇబ్బంది లేకుండా.. ముందుస్తుగా ఇసుక అధిక మొత్తంలో నిల్వ చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సంచివాలయంలో నిన్న గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో ఇసుక నిల్వ చేసి, అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాకాలం అవసరాలకు కోటి టన్నుల మేర నిల్వ చేయాలని, వర్షాలు మొదలయ్యే లోపరీ ప్రక్రియ అంతా పూర్తి కావాలని ఆదేశించారు.

-----------------------------

తెలంగాణలో కుల గణనను విజయవంతంగా నిర్వహించామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న అఖిల భారత కాంగ్రెస్ కమీటీ సమావేశాల్లో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం 21 వేల కోట్ల రూపాయల మేర రైతులకు రుణమాఫీ చేశామని తెలియజేస్తూ..

వాయిస్.. 31 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ సాంకేతికతను వినియోగించి గంజాయి సాగు, రవాణాను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని హోంశాఖ మంత్రి వి.అనిత తెలిపారు. విశాఖపట్నంలో నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, అల్లూరి, మన్యం జిల్లాల్లో 90శాతం మేరకు గంజాయి సాగు తగ్గిందని చెప్పారు. ప్రతి జిల్లా కేంద్రంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..31 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన రాష్ట్రమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ముంబై ప్రారంభమైన దక్షిణాసియా 20వ హెూటల్స్ పెట్టుబడుల సమావేశంలో నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 20కి పైగా ప్రసిద్ధ హెూటల్స్, ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రంలో ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, పర్యాటక రంగానికి పారిశ్రామిక హెూదా కల్పించామని, పరిశ్రమలకు ఇస్తున్న అన్ని రాయితీలూ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి కూడా కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల

సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వీడియో సందేశమిస్తూ.. హడ్కో ద్వారా 11 వేల కోట్ల రూపాయలను రాష్ట్రానికి ఇవ్వడానికి ఒప్పందం జరిగిందని చెప్పారు ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా లొక వెయ్యి 4 వందల కోట్ల రూపాయల అందిస్తుందని చెప్పారు. కేంద్ర సహకారాన్ని అందిపుచ్చుకొని, నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని పురందేశ్వరి పేర్కొంటూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

జైన మతంలోని 24 మంది తీర్థంకరుల్లో ఒకరైన వర్ధమాన మహావీరుడి జయంతిని ఈ రోజు జరుపుకుంటున్నాం. జైన మత తత్వ సిద్ధాంతాలను క్రోడీకరించిన వర్ధమాన మహావీరుడు చైత్ర శుద్ధ త్రయోదశి రోజున, క్రీస్తు పూర్వం 599 సంవత్సరంలో జన్మించారు. వర్ధమాన మహావీరుడు మొత్తం 55 ప్రవచనాలు, ఉత్తరాధ్యయన సూత్రాలు అనే ప్రసంగాలు చేశారు. అహింసో పరమోధర్మ: అని భోదించారు. అహింసతో జీవిస్తూ మోక్షాన్ని సాధించాలనే ఆయన బోధనలు నేటికీ ప్రపంచశాంతికి మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయి.

---------------------------

తెలంగాణలో కురుస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు రైతులకు వాతావరణ పరిస్థితుల గురించి తెలియజేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని పంటనష్టాలపై మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మరికొన్ని రోజులు వర్షాలున్నాయని వాతావరణ శాఖ సూచనల దృష్ట్యా ఈ వివరాలను రైతులకు ముందే తెలియజేస్తే వారు అప్రమత్తంగా ఉండి, నష్టాలను నివారించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాల వారీగా రైతులకు వాతావరణ వివరాలను తెలియజేయాలన్నారు. ధాన్యాన్ని ఇళ్లు, గోదాములకు తరలించి నిల్వ చేయాలని, మార్కెట్‌కు వచ్చిన పంట ఉత్పత్తులు తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

ఈరోజు ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. హోమియోపతి వైద్య విధానానికి పితామహులు, డాక్టర్ శామ్యూల్ హానీమన్ జయంతిని పురస్కరించుకుని ఆయనను స్మరించుకుంటూ ప్రతి ఏటా ఏప్రిల్ 10వ తేదీన హోమియో దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. 1755 ఏప్రిల్ 10వ తేదీన జర్మనీలో జన్మించిన హానీమన్ హోమియోపతి వైద్య విధానాన్ని కనుగొనడంతో పాటు ఫార్మకాలజీ, నానోవైద్యం వంటి అనేక విధానాలను రూపొందించారు.

కాగా... "అధ్యయనం, బోధన, పరిశోధన" అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

=====================